క్లుప్తంగా

ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

పిడుగురాళ్ల: గురజాల నియోజకవర్గంలోని ప్రజలందరికి వినాయక చవితి శుభాకాంక్షలను గురజాల మాజీ శాసన సభ్యులు కాసు మహేష్‌రెడ్డి తెలిపారు. అందరు ఆనందంగా జీవితం గడపాలని ఆయన ఆకాంక్షించారు.

సెప్టెంబర్ 27న విత్తన బంతులు చల్లే కార్యక్రమం

కారెంపూడి: కారెంపూడి నల్లమల అడవిలో సెప్టెంబర్ 7న భారీగా విత్తన బంతులు చల్లే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు పర్యావరణ ప్రేమికుడు నాగమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల దృష్ట్యా విత్తన బంతులు మొలకెత్తే అవకాశం ఉందని చెప్పారు. వనాల అభివృద్ధి, అడవుల పెంపకం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కొమెర అంకారావు(జాజి) ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు విత్తన బంతులు తయారు చేసుకుని వాటిని అడవిలో చల్లే సామూహిక కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా కోరారు.

29న కారెంపూడిలో బహిరంగ సభ

కారెంపూడి: విజయోత్సవ సభ ఈ నెల 29వ తేదీ కారెంపూడిలో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నదని ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ విజయోత్సవ సభను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక ఆర్ అండ్‌బీ బంగ్లా సమీపంలో బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే లైసెన్స్ రద్దు



కారెంపూడి: ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని మండల వ్యవసాయ శాఖ అధికారి పోట్ల నరసింహారావు హెచ్చరించారు. మంగళవారం ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డీఏపీ నిల్వలు సరిపడా ఉన్నాయని ఇంకా తెప్పిస్తున్నామని చెప్పారు. అలాగే డీఏపీ, యూరియా రైతు సేవా కేంద్రాలు, సొసైటీలలో కూడా లభ్యం అవుతాయన్నారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ తీసుకుని ఎరువులు ఎమ్మార్పీ ధరకు తీసుకెళ్లవచ్చన్నారు. ఏమైనా ఇబ్బందులుంటే తనకు ఫోన్ చేస్తే తగిన చర్యలు తీసుకుంటానని చెప్పారు.

మండపాలకు విద్యుత్‌శాఖ అనుమతి తప్పని సరి

కారెంపూడి: వినాయక చవితి వేడుకల మండపాలను విద్యుత్ లైన్లకు సమీపంలో ఏర్పాటు చేయవద్దని కారెంపూడి ఏఈ జి.వీరాంజనేయులు మంగళవారం కోరారు. మండపాలు ఏర్పాటు చేసే వారు విద్యుత్ శాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. అధికారులు సిబ్బంది ఆ ప్రాంతాన్ని సందర్శించి సురక్షితంగా విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు చేస్తారని పేర్కొన్నారు. డైరెక్టుగా లైన్‌పై తీగలు వేయవద్దని, అలాగే జాయింట్లు టేపు వేయకుండా వదలివేయవద్దని కోరారు. నేల మీద విద్యుత్ వైర్లు పడేయవద్దని వాటిని సురక్షిత మార్గాల ద్వారా మండపంకు లైటింగ్‌కు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

ఫొటో సేకరణ త్వరితగతిన పూర్తి చేయండి



శావల్యాపురం: రీసర్వే జరిగిన రెవెన్యూ గ్రామాల్లో ప్రభుత్వం మంజూరు చేయాల్సిన నూతన పట్టాదారు పాసు పుస్తకాల్లో తప్పులు సవరణలు మార్పులు చేర్పులు ఫొటోల సేకరణ పనులు పారదర్శకంగా చేయాలని నరసరావుపేట ఆర్డీవో కె.మధులత తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ అధికారులు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మధులత మాట్లాడుతూ నరసరావుపేట డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 84 వేల పట్టాదారు పాసుపుస్తకాలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. శావల్యాపురం మండలంలో 1338 మంది రైతుల దగ్గరి నుంచి నూతన పట్టాదారు పాసుపుస్తకాలపై ముద్రించాల్సిన పాస్ ఫొటో సైజ్‌ఫొటోలు సేకరణ పనులు జాప్యం కావటంతో రెవెన్యూ అధికారులు సంబంధిత గ్రామ వీఆర్వోల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. పోట్లూరు-598, వేల్పూరు-271, పిచికలపాలెం-155, కనమర్లపూడి-314 గ్రామాల్లోని రైతుల నుంచి ఫొటోలు సంబంధిత వీఆర్వోలు సేకరించాలని, తదపరి తహసీల్దారు లాగిన్ ద్వారా ఆన్‌లైన్ నమోదు చేస్తారన్నారు. వారం రోజుల వ్యవధిలో ఈప్రక్రియ పూర్తి చేయాలన్నారు.

ఊరూవాడా వినాయక చవితి సందడి



పూజ సామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు



పూజకు తరలి వెళ్తున్న గణనాథులు



మట్టి గణనాథుల విగ్రహాలను పంపిణీ చేస్తున్న దాతలు



అంబేడ్కర్ సెంటర్‌లో సందడి దృశ్యం

పిడుగురాళ్ల రూరల్: వినాయక చవితి వేడుకలకు సర్వసిద్ధం అయింది. ఊరూవాడా మండపాలు ఏర్పాటు చేసి వినాయకుడి పూజలు నిర్వహించనున్నారు. ఇప్పటికే మండపాలు సిద్ధం చేశారు. విగ్రహాలను కొనుగోలు చేసి మండపాలకు తరలిస్తున్నారు. రంగులు చల్లుకుంటూ, కనక తప్పెట్ల మోతలతో యువకులు చిందులు వేసుకుంటూ బోలో గణేష్ మహారాజ్ కి జై అంటూ తమ ఊర్లకు గణనాథులను తీసుకెళుతున్నారు.

మార్కెట్లో సందడి...

నవరాత్రుల పూజా సామగ్రి వినాయక ప్రతిమల కొనుగోళ్లతో మార్కెట్ సెంటర్లో సందడిగా మారింది. వినాయకుడికి సమర్పించే పత్రి, ఎలక్కాయ, జాపత్రి, ఏక బిల్వం, పండు, పాలవెల్లి తదితర సామగ్రితో మార్కెట్ కిక్కిరిసింది. సాధన రోజుల కన్నా ధరలు పెంచి విక్రయించారు. వైవిధ్య భరిత గణపతి మూర్తులు చిన్న ప్రతిమలు రూ.100 నుంచి రూ.1000 వరకు సైజును బట్టి విక్రయించారు.

మాచర్లలో..

మాచర్ల రూరల్: వినాయక చవితికి మండపాలు సిద్ధం చేశారు. ప్రతిమల ఏర్పాటు చేసే ప్రాంతంలో పెద్ద స్టేజి నిర్మాణం చేసి రంగు రంగుల విద్యుత్ దీపాలతో పందిళ్లు నిర్మించారు. పట్టణంలోని పలు వార్డులలో కళ్యాణ మండపాలను తలపించే రీతిలో దేవాలయ ఆకృతులలో పెద్ద పెద్ద సెట్టింగ్‌లు, స్తంభాలను నిర్మించి పలువురిని ఆకట్టుకుంటున్నాయి.

వినాయక చవితి సందడి

మాచర్ల: వినాయకచవితి ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్, మార్కెట్ సెంటర్, తదితర ప్రధాన ప్రాంతాల్లో మంగళవారం సందడి నెలకొంది. వినాయక చవితి పూజ కోసం పత్రి కొనుగోలు కోసం చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పట్టణానికి తరలి రావడంతో సందడి నెలకొంది. పట్టణంలో రహదారులకు ఇరువైపులా మట్టి గణపతి విగ్రహాలు, పత్రిమలు విక్రయించే వారు, కొనుగోలు చేసే ప్రజలతో ఆయా ప్రాంతాలు సందడిగా మారాయి.

వినాయక చవితికి సర్వం సిద్ధం

గురజాల: గణపతి నవరాత్రి మహోత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. మండలంలో సుమారుగా 40కి పైగా వినాయకచవితి పందిళ్లను సిద్ధం చేశారు. ప్రత్యేకంగా మండపాలను ఏర్పాటుచేసి గణనాథలను కొలువుదీర్చారు. విద్యుత్ దీపాల అలంకరణతో శోభాయమానంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రత్యేకంగా వాహనాల్లో వినాయక విగ్రహాలను మండపాలకు చేర్చే పనిలో కమిటి నిర్వాహకులు నిమగ్నమైయ్యారు. జై బోలో గణేష్ మహారాజ్‌కీ జై అంటు నినాదాలు చేసుకుంటూ మండపాలకు తరలిస్తున్నారు.

మట్టి వినాయకుని విగ్రహాల ఉచిత పంపిణీ

రెంటచింతల: ప్రతి ఒక్కరూ వినాయక చవితిని ఎంతో ఘనంగా జరుపుకుంటారని ఫ్రెండ్స్ ఇన్ నీడ్ ఫౌండేషన్ అధ్యక్షులు పేరం చెన్నారెడ్డి అన్నారు. మంగళవారం వెయ్యి వినాయకుని విగ్రహాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ఎనిమిదేళ్లుగా సుమారు 12 వేలకు పైగా వినాయకుని మట్టి విగ్రహాలను పంపిణీ చేశామని, ఈ ఏడాది దాత రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశామన్నారు. ప్రతి ఏటా భక్తులు ఉచితంగా మట్టి విగ్రహాలను తీసుకెళ్తున్నారన్నారు. పలువురు దాతల సహకారంతో వినాయకుని విగ్రహాల పంపిణీని ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. మంచికల్లు జెడ్పీ ఉన్నత పాఠశాల చిన్నారులు మట్టి గణపతులను తయారు చేశారని హెచ్‌ఎం వసంత కుమారి తెలిపారు. కార్యక్రమంలో ఆదిరెడ్డి, చంద్రశేఖర్, భట్టాచార్యులు పాల్గొన్నారు.

ముందస్తు చవితి సంబరాలు



వినాయకుని వేషధారణలో విద్యార్థులు



వినాయకుని ఆకృతిలో..

పిడుగురాళ్ల రూరల్: మండలంలోని బ్రాహ్మణపల్లిలోని గీతక సీబీఎస్‌ఈ పాఠశాలలో ముందస్తు వినాయక చవితి వేడుకలు మంగళవారం నిర్వహించారు.. వినాయకుడి ఆకతిలో విద్యార్థులు చేసిన విన్యాసం అందరినీ ఆకర్షించింది.. విద్యార్థులు రేగడి మట్టి తెచ్చి చక్కనైన గణపతి విగ్రహాలను చేశారు. పాఠశాల చైర్మన్ బాలగంగాధర్ రెడ్డి వినాయక చవితి ప్రత్యేకతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, డైరెక్టర్ వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ అధ్యక్షుడిగా శ్రీరామమూర్తి

మాచర్ల: ఏపీయూడబ్ల్యూజే నూతన మాచర్ల నియోజకవర్గ అధ్యక్షుడిగా కొత్తమాసు శ్రీరామమూర్తి ఎన్నికయ్యారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మురళి, యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో కొత్తమాసు శ్రీరామమూర్తిని రెండో సారి మాచర్ల నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. శ్రీరామమూర్తిని పలువురు అభినందించారు.

పట్టణంలో విస్తృతంగా పారిశుద్ధ్య పనులు

మాచర్ల: పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు పురపాలక సంఘ కార్మికులతో చేయించారు. మురుగు పేరుకుపోయిన కాలువలను శుభ్రం చేయించారు. చెత్త, చెదారం లేకుండా శుభ్రం చేశారు. పట్టణంలో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

రాధాకృష్ణన్ ప్రతిభా అవార్డుకు నరసింహారావు ఎంపిక



పిడుగురాళ్ల: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జాతీయ ప్రతిభ పురస్కారానికి స్థానిక ఎస్టీ జోసఫ్ గరల్స్ హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయుడు ఎంపికైనట్లు హెడ్ మిస్టరీస్ సిస్టర్ రాణి మంగళవారం తెలిపారు. గుంటూరు సదరన్ ప్రైవేట్ లెక్చరర్ అండ్ టీచర్స్ ఆర్గనైజేషన్, కేవీఆర్ అండ్ జయలక్ష్మీ ఎడ్యుకేషన్ ట్రస్ట్ అందజేయనున్న ఈ వార్డులకు తమ పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు చింతల నరసింహారావు ఎంపికై నట్లు ఆమె పేర్కొన్నారు. గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ నెల 31న నిర్వహించనున్న ఉత్సవంలో వీరికి అవార్డును అందజేసి సత్కరించనున్నట్లు తెలిపారు. అనంతరం నరసింహారావు పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

విశ్వమాత మదర్‌థెరిస్సాకు ఘన నివాళి



మదర్‌థెరిస్సా విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డాక్టర్ దాక్షాయణి



మదర్‌థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న భాస్కర్‌రెడ్డి, సిస్టర్ అనిత

మాచర్ల: స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ మాచర్ల ఆధ్వర్యంలో విశ్వమాత మదర్‌థెరిస్సా జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. మాచర్ల- శ్రీశైలం రోడ్డులోని స్వామి వివేకానంద సేవాశ్రమంలో నిర్వహించిన జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా డాక్టర్ జి.దాక్షాయణి పాల్గొన్నారు. ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ మెట్టు గోవింద రెడ్డి, డాక్టర్ జి.దాక్షాయణి మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మదర్‌థెరిసా దేశానికి చేసిన సేవలు వెలకట్టలేనివని చెప్పారు. కుష్టు వ్యాధిగ్రస్తులకు, అనాథలకు, రోగ పీడితులకు ఆమె అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఎక్కడో విదేశాల్లో పుట్టి భారతదేశానికి వచ్చి అనాథ పిల్లలను చేరదీసి వారిని తమ సొంత పిల్లల్లాగా చూసుకొని జీవితాన్ని త్యాగం చేసిన మాతృమూర్తి అని పేర్కొన్నారు. మదర్ థెరిస్సాను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మహానుభావుల పుట్టినరోజు వేడుకలను నిర్వహించడంతోపాటు, పేదలకు పలు సేవా కార్యక్రమలు అందిస్తున్న మెట్టు గోవింద రెడ్డి అభినందనీయులని కొనియాడారు. సేవాశ్రమంలో ఉన్న వృద్ధులకు, పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెడ్ మాస్టర్ ముత్యాల పాపి రెడ్డి, శ్రీహరి, గుంటూరు ప్రభావతి, టి.ఇందిరా దేవి, ఆర్టీసీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సాను ఆదర్శంగా తీసుకోవాలి

మాచర్ల: మానవాళికి మదర్ థెరిస్సా జీవితం ఆదర్శమని సేవా సమితి ప్రధాన కార్యదర్శి మోర భాస్కర్‌రెడ్డి అన్నారు. ప్రపంచ విశ్వమాత మదర్‌థెరిస్సా జయంతిని సోమవారం సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత మదర్‌థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో గాదె కిరీటిరెడ్డి, సిస్టర్ అనిత, ప్రధాన కార్యదర్శి మోర భాస్కర్ రెడ్డి, మాచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఎర్రబోతుల శ్రీనివాసరావు, కసిరెడ్డి శాంతి రెడ్డి, ముత్యాల పాపిరెడ్డి, అందుకుల చంద్రయ్య, డి.శౌరి రెడ్డి, మార్తా టీచర్ పాల్గొన్నారు.

మదర్ థెరిసా జయంతి వేడుకలు

మాచవరం: మానవత్వానికి మారుపేరుగా మదర్ థెరిస్సా నిలిచారని సైకాలజిస్ట్ డాక్టర్ పవిత్ర అన్నారు. మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మదర్ థరిస్సా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మానసిక ఆరోగ్య నిపుణురాలు డాక్టర్ పవిత్ర మాట్లాడుతూ మదర్ థెరిస్సా జీవితం, సేవలు మరియు మానవత్వ సందేశాల గురించి తెలియజేశారు. మదర్ థెరిసా ఆశయాలను సమాజంలో అమలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రసాదరావు, డాక్టర్ అన్వేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లులు వసూలు

మాచర్ల: వినాయక చవితి సెలవు రోజున విద్యుత్ కార్యాలయంలో బిల్లులు వసూలుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు ఏఈ కోటేశ్వరరావు మంగళవారం తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ప్రస్తుత బిల్లులు, పాత బకాయిలు చెల్లించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

ఎరువుల దుకాణాలలో తనిఖీలు



రెంటచింతలలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు



ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న తనిఖీ అధికారులు

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని మార్కెట్ యార్డులో డీసీఎంఎస్ గోదాం, గ్రోమోర్ కేంద్రాన్ని, ప్రైవేటు ఎరువుల దుకాణాలను స్క్వాడ్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. ఎరువుల నిల్వ పుస్తకాలు రైతులకు పంపిణీ చేసిన రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే యూరియా అమ్మకాలు జరపాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి నాగరాజు, ఏఓ లక్ష్మారెడ్డి, తహసీల్దార్ మేరీ కనకం, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎస్ఐ నాగార్జున, కార్తీకేయ, మన్మోహన్ పాల్గొన్నారు.

ఎరువుల కొరత సృష్టిస్తే సహించేది లేదు

పిడుగురాళ్ల: ఎరువుల కొరత సృష్టిస్తే సహించేది లేదని మండల ప్రత్యేకాధికారి ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల షాపులను స్క్వాడ్ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు మండలంలోని ప్రతి ఎరువులు పురుగు మందుల షాపులను తనిఖీ చేస్తున్నామని, ఎవరు ఎరువులను కృత్రిమ కొరత సృష్టించవద్దని తెలిపారు. దాడుల్లో తహసీల్దార్ మధుబాబు, ఇన్‌చార్జి ఏఓ వెంకటేష్, ఎస్ఐ మోహన్ పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో..

పిడుగురాళ్ల: పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల షాపులపై విజిలెన్స్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. మధ్యాహ్నం 4 గంటల నుంచి పట్టణంలోని పలు షాపులను తనిఖీలు చేశారు. స్టాక్ రిజిస్టర్, అమ్మకపు రిజిస్టర్ వంటి వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎరువులు తప్పనిసరిగా ఎమ్మార్పీకే విక్రయించాలని తెలిపారు. అధిక ధరలకు విక్రయిస్తే సహించేది లేదన్నారు. విజిలెన్స్ సీఐలు చంద్రశేఖర్, శివాజీ, విజిలెన్స్ ఏఓ సీహెచ్ ఆదినారాయణ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

మాచవరం: మండల కేంద్రమైన మాచవరంలోని ఎరువుల దుకాణాల్లో మండలం ప్రత్యేక అధికారి బి.శ్రీ కృష్ణదేవరాయలు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమం అనంతరం పత్తి పంటను పరిశీలించి రైతులకు వివిధ రకాల చీడపీడలు మరియు తెగుళ్ల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి కే రామమ్మ, మాచవరం వ్యవసాయ సహాయకులు కే ప్రియాంక పాల్గొన్నారు.

అర్థమయ్యేలా పాఠాలు బోధించాలి

- దత్తత పాఠశాల ఉపాధ్యాయులకు కలెక్టర్ సూచన
- లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో సంభాషణ



విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట రూరల్: సిలబస్ పూర్తిచేయడమే లక్ష్యంగా పెట్టుకోకుండా విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు సూచించారు. దత్తత పాఠశాల లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌ను మంగళవారం కలెక్టర్ సందర్శించారు. తరగతి గదిలో ఆయన ఓ ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థుల విద్యాభ్యాస పరిస్థితిని సమీక్షించారు. విద్యార్థుల అభ్యాసన స్థాయిని అంచనా వేసేందుకు సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థి ప్రాథమిక అంశాలపై పట్టు సాధించేలా చేయడంపై విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. వారంలో రెండుసార్లు పాఠశాలను సందర్శించి బోధనా పద్ధతులను సమీక్షించాలని డీఈవో చంద్రకళను ఆదేశించారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



దాచేపల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కందుల జాన్ అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఎంపీపీ జాన్ మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో డెంగీ, మలేరియా సీజనల్ వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని చెప్పారు. గ్రామాల్లో పారిశుధ్యం పనులు ఎప్పటికప్పుడు నిర్వహించాలని, మురుగు కాలువల్లో నీరు నిల్వ లేకుండా దోమలు పెరగకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలితే తక్షణమే వైద్య సేవలు అందించేలా ఆరోగ్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించేలా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చెప్పారు. సమావేశంలో వైస్ ఎంపీపీ తండా అబ్దుల్ సత్తార్, మండల ప్రత్యేక అధికారి ప్రకాష్ కుమార్, ఎంపీడీఓ దేవరపల్లి వీరయ్య, ఎంఈఓ పినాకపాణి, ఏపీఎం జయచంద్ర పాల్గొన్నారు.

అర్హత ఉన్న రైతులకు రుణాలు

ఎస్‌బీఐ నరసరావుపేట రీజనల్ మేనేజరు రవికుమార్



ఖాతాదారుడిని సత్కరిస్తున్న రీజనల్ మేనేజరు

శావల్యాపురం: ఎస్‌బీఐ బ్యాంకు శాఖ వారి సారధ్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని అర్హత కల్గియున్న రైతులందరికీ రుణాలు మంజూరు చేస్తామనిఎస్‌బీఐ నరసరావుపేట రీజనల్ మేనేజరు (ఆర్‌ఎం) పి.రవికుమార్ అన్నారు. మండలంలోని మతుకుమల్లి గ్రామంలోని ప్రధాన కూడలి మార్గంలో ఎస్‌బీఐ బ్యాంకు ఖాతాదారులు రైతులకు బ్యాంకు పథకాలపై బీమా యోజన తదితర వాటిపై అవగాహన సదస్సు శావల్యాపురం ఎస్‌బీఐ బ్యాంకు శాఖ మేనేజరు వలేటి ప్రసాదు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రీజనల్ మేనేజరు రవికుమార్ మాట్లాడుతూ ఆర్‌బీఐ ఆదేశాల మేరకు బ్యాంకు ఖాతా కల్గియున్న వారందరు కేవైసీ నమోదు చేయించాలన్నారు. అర్హత కల్గియున్న రైతులకు రూ.5 లక్షల నుంచి రూ.50 కోట్ల వరకు రుణ సదుపాయం అందజేయు ఏకైక బ్యాంకు శాఖ ఎస్‌బీఐ అన్నారు. సంప్రదాయ వ్యవసాయ పద్ధతుల నుంచి ఆధునీకరణ వ్యవసాయం చేసే విధంగా వ్యవసాయ యంత్రపరికరాలు ద్వారా రైతులను ప్రోత్సహించి వారి ఆర్థిక ప్రగతికి సాధించడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. అలాగే స్వయం సిద్ధ పథకం ద్వారా స్వయం సహాయక మహిళా గ్రూపుల్లోని ఒక్కో సభ్యురాలకు యూనిట్ రూపంలో రూ.10 లక్షలు వరకు రుణాలు మంజూరు చేస్తామన్నారు. రుణాలు సకాలంలో చెల్లించిన ఖాతాదారులకు రుణాలు పెంపుదల చేస్తామన్నారు. బ్యాంకుల్లో దళారులు ప్రమేయం లేకుండా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. త్వరలో వినుకొండ ఉన్ననటువంటి గుమ్మనంపాడు ఎస్‌బీఐ బ్యాంకు అదే గ్రామంలో నూతన బ్రాంచ్ ఏర్పాటుకు అనుమతులు వచ్చినట్లు తెలిపారు. అవగాహన సదస్సులో శావల్యాపురం, కారుమంచి ఎస్‌బీఐ బ్యాంకు శాఖల మేనేజర్లు వలేటి ప్రసాదు,సునీల్, చీఫ్ మేనేజరు పాల్,, మున్నింగి కిరణ్ రైతులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలి

–ఆర్డీఓ మురళీకృష్ణ



గురజాల: ప్రజలు వినాయక చవితిని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని రెవెన్యూ డివిజనల్ అధికారి మురళీకృష్ణ సూచించారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో మంగళవారం వినాయక చవితి పండుగను పురస్కరించుకుని అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ మండపాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. నిమజ్జన ఘాట్‌ల వద్ద లైటింగ్‌తో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి చర్చించారు. మండపాల వద్ద విద్యుత్ సరఫరాను ఎప్పటికప్పుడు చెక్ చేస్తు ఉండాలన్నారు. సమావేశంలో తహసీల్దార్లు శ్రీనివాసరావు, మేరి, సీఐ భాస్కర్ పాల్గొన్నారు.